ట్రాఫిక్ సమస్యతో సతమతం


యనమదుర్రు డ్రెయిన్ వంతెనలపై నిలిచిపోయిన వాహనాలు


వెంకట్రామ టాకీసు రోడ్డులో వాహనాల రద్దీ


ప్రకాశం చౌక్ సెంటర్‌లో వాహనాలు

- భీమవరం పట్టణంలో పెరిగిన రద్దీ
- పండుగ సెలవుల నేపథ్యంలో కిక్కిరిసిన రోడ్లు

భీమవరం: సంక్రాంతి పండుగ సందర్భంగా భీమవరం పట్టణంలో రోడ్లు వాహనాలతో రద్దీతో ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా తెలంగాణ, కర్ణాటక, చెన్నై రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగుళూరు తదితర నగరాల నుంచి పెద్ద సంఖ్యలో కార్లలో ఉభయ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన వస్తుండడంతో రోడ్లు రద్దీగా ఉన్నాయి. అయితే శనివారం సెలవు దినం కావడం, పండుగ దగ్గర పడడంతో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందినవారు పెద్ద సంఖ్యలో రావడం జిల్లాకు చెందినవారు కూడా బంధువుల ఇళ్లకు ప్రయాణం కావడంతో పట్టణంలోని రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.

ఇరుకు రోడ్లతో సమస్య

భీమవరం పట్టణంలోని రోడ్లు అసలే ఇరుకుగా ఉండడం షాపుల వద్ద వాహనాలను రోడ్లపైనే నిలపడం, తగినంత ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో మామూలు రోజుల్లోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. దీనికి తోడు ఆటోలు సైతం రోడ్లపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం పెద్ద సమస్యగా మారింది. భీమవరం జిల్లా కేంద్రం కావడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైంది. ప్రధానంగా అంబేడ్కర్ సెంటర్ నుంచి యనమదుర్రు డ్రెయిన్‌పైన ఉన్న వంతెనలు, అలాగే ప్రభుత్వాసుపత్రి వద్ద యనమదుర్రు డ్రెయిన్‌పై కాలిబాట వంతెన వద్ద నిత్యం ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు గంటల తరగతి వాహనాలు ముందుకు కదలక అవస్థలు పడుతుంటారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువ కావడంతో పట్టణం దాటి ముందుకు వెళ్లాలంటే గంటల సమయం పడుతోందని ప్రయాణీలకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్యతో చిన్నరోడ్లపైకి వెళ్లడానికి ప్రయత్నం చేస్తుండడంతో సందుల్లో కూడా ట్రాఫిక్ నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీలో సంక్రాంతి సంబరాలు


అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ఉండిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోడ్ నంబర్ 100 కేంద్రంలో చిన్నారులు, వారి తల్లులు, అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేసి, భోగి పండ్లు పోశారు. అందంగా ముగ్గులు వేసి వాటిలో గొబ్బెమ్మలు ఏర్పాటు చేశారు. అనంతరం పిండి వంటలు వండి చిన్నారులకు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గడి కుసుమ, చైతన్య, సుబ్బలక్ష్మి, అన్నపూర్ణ, జయశ్రీ, అనంతలక్ష్మి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి


మంత్రి సత్య కుమార్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

ఆకివీడు: సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ, వార్డు ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని ఆరోగ్య శాఖమంత్రి సత్య కుమార్ యాదవ్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ హెల్త్ సెక్రటరీలకు గ్రేడ్ 3 ఏఎన్‌ఎం నుంచి ఎంపీహెచ్‌ఏ ఫిమేల్ పదోన్నతి కోసం అక్టోబర్ 7న వినతి పత్రం అందజేశామన్నారు. సీనియార్టీ మెరిట్ లిస్టు ఇతర జిల్లాల నుంచి రాకపోవడంతో పదోన్నతి కల్పించలేదని చెప్పారని, అన్ని జిల్లాల నుంచి జాబితాను త్వరితగతిన వచ్చే విధంగా చర్యలు తీసుకుని, పదోన్నతి కల్పించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు వి.దుర్గ, పీ.బేబీ దైవాజీ, వీ.అరుణ, వెంటలక్ష్మి, సౌశీల్య, జయామని, నాగమణి ఉన్నారు.

పెరిగిన చలి తీవ్రత


నాగేంద్రపురం గ్రామంలో ఉదయం సమయంలో చలి తీవ్రత

భీమవరం అర్బన్: గత నాలుగు రోజులుగా చలి గాలుల తీవ్రత బాగా పెరిగింది. ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. రాత్రి సమయాల్లో చలు గాలులు, మంచు తీవ్రత పెరగడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వివిధ వృత్తులు, వ్యాపారులు, దూరం నుంచి వచ్చే అతిథులపై మంచు ప్రభావం ఈ ఏడాది తీవ్రంగా పడింది. మంచు కప్పేయడంతో ఉదయం 9 గంటలైన సూర్యుడు రాకపోవడంతో వివిధ వృత్తుల వారు చలి వల్ల పనిచేయలేకపోతున్నామని చెబుతున్నారు. అంతేకాకుండా మండలంలో ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఉదయాన్నే కూలీలు ఎవరూ పనులకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. శనివారం మంచు దుప్పటి కప్పేయడంతో చిరు వ్యాపారులు, మత్స్యకారులు తమ పనులకు ఆటంకం ఏర్పడుతుందని వాపోతున్నారు. మంచులో తిరగడం వల్ల జలుబు, మైగ్రేన్ వంటి వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా ఆస్తమా ఉన్నవారు మంచులో తిరగకూడదని చెబుతున్నారు.

మావుళ్లమ్మ ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన


ఉత్సవాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ వారి వార్షిక ఉత్సవాల ఏర్పాట్లు భీమవరం డీఎస్పీ జయసూర్య శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల ఏర్పాట్లల్లో ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. క్యూ లైన్లల్లోని భక్తులు ఇబ్బందులు లేకుండా వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి జనం పెద్ద సంఖ్యలో తరలివస్తారు కాబట్టి దేవస్థానం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకుసూచించారు. ఆయన వెంట ఆలయ ఈఓ బుద్ద మహాలక్ష్మీ నగేష్, సీఐ నాగరాజు ఉన్నారు.

రసవత్తరంగా రీయూనియన్ క్రికెట్ మ్యాచ్‌లు


భీమవరంలో క్రికెట్ ఆడుతున్న రీయూనియన్ క్రికెట్ క్రీడాకారులు

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాల ఆవరణలో గన్నాబత్తులవారి క్రీడామైదానంలో రీయూనియన్ క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. పట్టణానికి చెందిన 1980–90 మధ్య కాలంలో క్రికెట్ ఆడి ప్రస్తుతం వివిధ నగరాలు, ప్రాంతాల్లో స్థిరపడిన ఉద్యోగులు, పారిశ్రామిక, వ్యాపార వేత్తలు ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు ముందుగా గత 12 ఏళ్లుగా రీయూనియన్ పేరుతో క్రికెట్ మ్యాచ్‌లునిర్వహిస్తున్నారు. సుమారు 100 మంది క్రికెట్ క్రీడాకారులు వివిధ జట్లుగా ఏర్పడి నిర్వహించే క్రికెట్ మ్యాచ్‌లకు స్థానికంగానే భోజనాలు ఏర్పాటు చేస్తారు. వీరంతా ప్రతి ఏటా తప్పనిసరిగా కలవాలనే లక్ష్యంతో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించడం విశేషం. దీనిలో భాగంగా శనివారం భీమవరం, ఏలూరు జట్లు మధ్య మ్యాచ్ జరగగా ముందుగా బ్యాటింగ్ చేసిన భీమవరం జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 143 పరుగులు చేసింది. ఈ జట్టులో మానేపల్లి సూర్యమాణిక్యం 43, పులగం శేషు 22 పరుగులు చేయగా ఏలూరు జట్టు 21 ఓవర్లలోనే 143 పరుగులు సాధించి విజయం సాధించింది. ఈ జట్టులో కిషోర్ 78, శర్మ 21 పరుగులు చేశారు. ఈ మ్యాచ్లో బ్యాటింగ్, బౌలింగ్‌లో ప్రతిభ కనబర్చిన సీనియర్ క్రికెటర్ మానేపల్లి సూర్యమాణిక్యం మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఆదివారం భీమవరం గ్రీన్స్, బ్లూస్ జట్లు మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగనుంది.

రంజీ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొన్నా



క్రికెట్‌కు అంతగా గుర్తింపులేని రోజుల్లో భీమవరం పట్టణం నుంచి క్రికెట్‌లో రంజీ స్థాయికి వెళ్లడం నాకు ఎంతో గర్వకారణం. భావితరాల వారికి స్ఫూర్తినివ్వడానికి ఇలాంటి రీ యూనియన్ మ్యాచ్‌లు నిర్వహించడంతో క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తిని కలిగించడంలో సఫలీకృతులవుతున్నారు.

– బృందావనం మంగేష్, రంజీ క్రీడాకారుడు, చెన్నై

ఈ రోజుల కోసం ఎదురు చూస్తుంటా....



మేము ఎక్కడ స్థిరపడినా మా మూలాలను మరిచిపోలేదు. చిన్నపుడు తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని మూడు రోజులు ఒక్క క్షణంలా గడిచిపోతాయి. ఏడాదికి సరిపడే ఎనర్జీని నింపుకుని మళ్లీ ఈ రోజుల కోసం ఎదురు చూడడం మాకు ఎంతో ఆనందాన్నిస్తుంది.

– భీమవరం భాషా, రంజీక్రీడాకారుడు, వైజాగ్

సంక్రాంతి కంటే ముందు వచ్చే పండుగ క్రికెట్



సంక్రాంతి కంటే ముందు వచ్చే క్రికెట్ పండుగను మేము బాగా ఎంజాయ్ చేస్తాం. వివిధ హోదాల్లో స్థిరపడినప్పటికీ ఈ మూడు రోజుల క్రికెట్ ఆడడం కోసం ఏడాదంతా ఎదురు చూస్తాం. డీఎన్నార్ కళాశాల గ్రౌండ్‌లో గత పన్నెండేళ్లుగా జరుగుతున్న క్రికెట్ పండుగకు క్రమం తప్పకుండా రావడం ఎంతో గర్వ కారణంగా ఉంటుంది.

సీహెచ్ రాధాకృష్ణ, రంజీ క్రీడాకారుడు, వైజాగ్

చిన్న పిల్లలుగా మారిపోతాం



భీమవరంలో జరిగే క్రికెట్ పండుగలో పాల్గొనడంతో మేము చిన్నపిల్లలం అయిపోతాం. ఆనాటి జ్ఞాపకాలను ఒకసారి నెమరువేసుకోవడానికి క్రికెట్ పండుగ ఒక వేదిక. ఊపిరి ఉన్నంత వరకు క్రీడాకారులకు రిటైర్‌మెంట్ ఉండదు. అందుకే వయసు పెరిగినా మా దగ్గర స్టెమినా తగ్గలేదు. క్రమం తప్పకుండా టోర్నీని నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తున్నాను.

– రెహమాన్, సీనియర్ క్రీడాకారుడు, హైదరాబాద్

కుల గణనలో తప్పులు సరి చేయాలి

భీమవరం: కులగణనలో మాల, మాదిగలకు ఆది ఆంధ్ర అని నమోదు చేయడం సబబుకాదని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్ కుమార్, కె.క్రాంతిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఎస్సీ, ఎస్టీల కుల గణనలో అనేక తప్పులున్నాయని వాటిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామంలో సచివాలయంలో ఏర్పాటు చేసిన జాబితాలో ఎక్కువమంది ఎస్సీలకు ఆది ఆంధ్రా పేర్కొన్నారని దానిని , మార్చమని కోరితే కుదరదని చెప్పడమేగాక జాబితాలో ఆది ఆంధ్రా అని వచ్చినా కుల ధ్రువీకరణ పత్రంలో మాత్రం మాదిగ, మాల వేరువేరు ఇస్తామని వెల్ఫేర్ అసిస్టెంట్ చెప్పడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఎస్సీల్లో 59 ఉప కులాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ అధికారులు క్షేత్ర స్థాయిలో కులగణనపై సమీక్షలు జరపాలని డిమాండ్ చేశారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు


వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

వీరవాసరం: మండలంలో ఎక్కడ చూసినా సంక్రాంతి సంబరాలు శనివారం పెద్ద ఎత్తున కొనసాగాయి. వీరవాసరం, నౌడూరు జంక్షన్, రాయకుదురు, కొణితివాడ, మత్స్యపురి తదితర గ్రామాల్లో ఆటలు పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించారు. నౌడూరు జంక్షన్‌లో కబడ్డీ, వాలీబాల్, ముగ్గుల పోటీలను పెద్ద ఎత్తున చేపట్టారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతికి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేల రూపాయలు, తృతీయ బహుమతి రూ.10 వేలు నాలుగో బహుమతి రూ.5 వేల చొప్పున బహుమతులు అందజేశారు. కబడ్డీ, వాలీబాల్ పోటీలు సైతం రసవత్తరంగా సాగాయి.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


ముగ్గులు పోటీల్లో బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో శనివారం సంక్రాంతి పండుగ సందర్భంగా దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆకివీడు వాటర్ డీసీ చైర్మన్ గోకరాజు శివ రామరాజు ముగ్గుల పోటీలను ప్రారంభించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని వేసిన వివిధ ముగ్గులు పలువురిని ఆకట్టుకున్నాయి. ముగ్గులు పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ముగ్గులకు ఉప సభాపతి ఉండి ఎమ్మెల్యే రఘురామకష్ణంరాజు చేతులమీదుగా ఆదివారం బహుమతులు అందించనున్నామని ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు తెలిపారు. జి.నాగమణి మొదటి బహుమతి గ్రైండర్, ఎం.మౌనిక రెండవ బహుమతి మిక్సీ, ఎం.యశోద మూడో బహుమతి కుక్కర్‌లు సాధించినట్లు ప్రకటించారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న అందరనికీ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు, దాట్ల లక్ష్మీదేవి, ముదునూరి శిరీష, ముదునూరి క్రితివర్మ, మాజీ జెడ్పీటీసీ అడ్డాల పద్మావతి, సాదు శ్రీనివాస్, కాళ్ల ఎస్ఐ శ్రీనివాసరావు, అడ్డాల గణపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాన్ని విజయవంతం చేయాలి


స్వర్ణోత్సవాలు సందర్భంగా నిర్వహించిన 2కే రన్‌లో పూర్వ విద్యార్థులు

ఆకివీడు: స్వర్ణోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి పూర్వ విద్యార్థి, ప్రస్తుత విద్యార్థులు హాజరుకావాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత పిలుపునిచ్చారు. మండలంలోని దుంపగడప వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం 2కే రన్ నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి దుంపగడప గ్రామంలోని కళాశాల ఆవరణ వరకూ 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో విశ్రాంతి ప్రిన్సిపాల్ థియోఫిలస్ మాట్లాడుతూ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులంతా మంచి ఉన్నత స్థితిలో ఉన్నారని చెప్పారు. ఎలాంటి వసతులూ లేని రోజుల్లోనే బురదలో వచ్చి పాఠాలు బోధించామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదవడం వల్ల మంచి స్థితికి వెళ్లారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధికమిటీ చైర్మన్ నంబూరి వెంకట్రామరాజు(తాడినాడ బాబు), కార్యదర్శి డాక్టర్ పీవీ ప్రతాప్‌కుమార్, భమిడిపాటి సూర్య భాస్కరరావు, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు గొంట్లా కృష్ణమూర్తి, నేరెళ్ల రామచెంచయ్య, కోశాధికారి ఈశ్వరరావు, కోడాలి వీరభద్రరావు, దాసరి సత్యనారాయణ, నెల్లి సతీష్, చేబోలు శ్రీనివాస్, ఎస్కే అమీర్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో కుడార్రై ఉత్సవాలు


భీమవరం(ప్రకాశం చౌక్): జువ్వలపాలెం రోడ్డులో వెంకన్న ఆలయంలో కుడార్రై సందడి


భీమవరం(ప్రకాశం చౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలో కుడార్రై నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా పట్టణంలో జువ్వలపాలెం రోడ్డులో ఉన్న శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో కుడార్రై మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని కుడార్రై మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ముదునూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కుడార్రై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించి అనంతరం సంప్రదాయబద్ధంగా కుడార్రై ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంతేటి వెంకట్రాజు, కార్యదర్శి కుక్కల బాలవెంకటరత్నం పాల్గొన్నారు.


కాళ్ల: ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

కాళ్లలో..

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో స్వయం భూః శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా శనివారం కుడార్రై పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కుడార్రై అక్కరసు (పాయసం) ప్రసాదాన్ని తయారు చేసి 1250 గిన్నెలతో స్వామి, అమ్మ వార్లకు నివేదించారు. ఈ సందర్భంగా ఆలయం అర్చకులు పాంచరాత్ర ఆగమం శ్రీ వైష్ణవ సాంప్రదాయంలో పాశురాలు, గానం చేశారు. యతిరాజుల ఆండాళ్ గోష్టి వారు గోదాదేవి అమ్మవారికి చీర, సారే సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఈఓ మోకా అరుణ్ కుమార్ పర్యవేక్షించారు.

శానిటరీ వర్కర్స్‌కు కనీస వేతనాలు చెల్లించాలి

పెనుగొండ: ఐదేళ్లుగా ప్రాథమిక,ఉన్నత పాఠశాలలో ఆయాలుగా పనిచేస్తున్న శానటరీ వర్కర్స్‌లో కనీస వేతనాలు రూ.26 వేలు, నెలనెలా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం పెనుగొండ పంచాయతీ పార్కు వద్ద జరిగిన శానిటరీ వర్కర్స్ సమావేశంలో తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయాలని, రోజుగు నాలుగు సార్లు టాయిలెట్స్ శుభ్రం చేస్తున్నా ప్రభుత్వ విధానాలతో ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో 300 విద్యార్థులకు ఇద్దరు ఆయాలు పని చేయాలన్న నిబంధన ఉండడంతో, ఒక్క విద్యార్థి తక్కువై 299 మంది విద్యార్థులు ఉన్న దేవ, వడలి పాఠశాలల్లో ఒక్కో ఆయాను తొలగించి, ఒక్కరి పైనే పనిభారమంతా వేస్తున్నారన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద పొరుగు రాష్ట్రాల మద్యాన్ని ఖరీదైన మద్యం బాటిల్స్‌లో వేసి విక్రయిస్తున్న తాడేపల్లి రఘునందన్‌ను శనివారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు చెప్పారు. రఘునందన్ ఈ నెల 8న పక్క రాష్ట్రం నుంచి మద్యం తీసుకువచ్చి దానిని ఖరీదైన మద్యం సీసాల్లో నింపి బ్లాక్ డాగ్ మద్యంగా నమ్మించి విక్రయాలు చేస్తున్న ముఠాలో సభ్యుడని బలరామరాజు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

సామాజిక పింఛన్ల తనిఖీ

ఇరగవరం: సామాజిక పింఛన్ల తనిఖీలో భాగంగా శనివారం ఇరగవరం మండలం అర్జునుడు పాలెం, ఇరగవరం1, 2, గోటేరు, కావలిపురం, రేలంగి 1,2,4 గ్రామాల్లో మంచానికే పరిమితైన పెన్షనర్లను అధికార బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీలో స్టేట్‌టీం డాక్టర్ జాన్ హారీషణ్, జిల్లా టీం డాక్టర్ సుష్మా, డాక్టర్ వై.మౌనిక, డాక్టర్ సాయి గిరి రెడ్డి, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు


భీమవరం అర్బన్: దేగాపురంలో బరులను ధ్వంసం చేస్తున్న అధికారులు


ఉండి: కోలమూరులో హెచ్చరిక బోర్డులను పెడుతున్న అధికారులు

భీమవరం అర్బన్: సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందేలు, గుండాట, పేకాట ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రావి రాంబాబు హెచ్చరించారు. మండలంలోని దేగాపురంలో శనివారం కోడిపందేలు ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా తహశీల్దార్ రావి రాంబాబు నేతృత్వంలో జేఏసీ కమిటీ దేగాపురంలో కోడిపందేలు నిర్వహించేందుకు వేసిన టెంట్‌లు, ఇతర సామాగ్రిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రావి రాంబాబు మాట్లాడుతూ కోడి పందేలు, గుండాట, పేకాట ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం వల్ల చట్టపరంగా కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయని చేజేతులా ఆ సెక్షన్లలో ఇరుక్కుని జీవితాలను చేజేతులా పాడు చేసుకోవద్దన్నారు. కోడి పందేలు నిర్వాహకులు, టెంట్‌లు ఇచ్చేవారిపైనా, స్థల యజమానులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేఏసీ బృందంలో రూరల్ సీఐ బంటుమిల్లి శ్రీనివాస్, రూరల్ ఎస్సై ఐ.వీర్రాజు ఉన్నారు.

ఉండిలో..

ఉండి: మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కోడిపందేల బరులు ధ్వంసం చేసినట్లు ఎస్సై నసీరుల్లా తెలిపారు.శ నివారం మండలంలోని కోలమూరు, పాములపర్రు ప్రాంతాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేస్తున్న కోడి పందేల బరులను ఆర్ఐ కార్తీక్‌తో సంయుక్తంగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఎవరైనా కోర్టు ఆదేశాలను ధిక్కరించి పందేలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో అప్పాజీ, వీఆర్ఏ గణేష్, కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.